ప్రజాశక్తి

ఆదివారం 15 సెప్టెంబర్ 2024

5

అల్లూరి సీతారామరాజు



విద్యార్థులకు సబ్బుల పంపిణీ

ప్రజాశక్తి -పాడేరు: ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల్లో చర్మవ్యాధుల నివారణకు పెర్మిలిన్ ప్లస్ సబ్బులు పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఐటీడీఏ పరిధిలోని 117 ఆశ్రమ పాఠశాలలో సుమారు 3500 మంది విద్యార్థులు చర్మవ్యాధులతో బాధపడుతున్నారని గుర్తించి ముందుగా సబ్బులు పంపిణీ చేశారు. గిరిజన సంక్షేమ పాఠశాలలో స్కాబీస్ తో బాధపడుతున్న విద్యార్థులను గుర్తించారు. రూ 5 లక్షల విలువైన సబ్బు లను ఐ టి డి ఏ కొనుగోలు చేసింది. చర్మవ్యాధులు విస్తరించకుండా నివారణ చర్యలు చేపట్టారు. స్థానిక ఆంగ్ల పాఠశాల విద్యార్థులకు సబ్బులు పంపిణీ చేశారు. అదేవిధంగా దిగుమోదా పుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో చర్మవ్యాధుల నివారణ సబ్బులు పంపిణీ చేశారు.సబ్బుల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎ టి డబ్ల్యూ ఎల్. రజిని, పలువురు ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



విత్తనాల ప్యాకెట్లను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారి నీలవేణి

వారపు సంతల్లో నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

- వ్యవసాయ శాఖ అధికారిని నీలవేణి- సంతల్లో తనిఖీలు - ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-డుంబ్రిగుడ : "వారపు సంతల్లో నకిలీ విత్తనాల జోరు" అనే కథనం ఈనెల 14న ప్రజాశక్తిలో ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన స్థానిక మండల వ్యవసాయ శాఖ అధికారిని నీలవేణి శనివారం మండలంలోని అరకు, కించుమండలో సందర్శించి విత్తనాల షాపులను తనిఖీ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో జరిగే వారపు సంతల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు తీసుకోకుండా అనధికారికంగా నకిలీ విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వారపు సంతల్లో సందర్శించి నకిలీ విత్తనాలు విక్రయించవద్దని ఎప్పటికప్పుడు హెచ్చరికలు చేస్తూనే ఉన్నామని ఆమె చెప్పారు. వ్యాపారులు మారకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకులో విక్రయాలు నిలిపివేత

- బంకు అడుగు భాగాన చేరిన వర్షపు నీరు - తొలగింపు పనులు చేపడుతున్న సిబ్బంది

ప్రజాశక్తి - చింతపల్లి : స్థానిక గిరిజన సహకార సంస్థ వద్ద ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకులో గత రెండు రోజులుగా పెట్రోలు అమ్మకాలు నిలిపివేశారు. ఇటీవల మన్యంలో కురిసిన భారీ వర్షాలకు బంకు లోపలకు ఊటనీరు చేరుతుండటంతో పెట్రోల్ సరఫరాకు అవరోధం ఏర్పడటంతో పెట్రోల్ అమ్మకాలు నిలిపివేశారు. బంకుకు దగ్గరలో ఎత్తైన కొండ ఉండటంతో అక్కడ నుంచి బంకు అడుగు భాగంలోకి నీరు చేరింది. లోపల నీటిని బకెట్లతో సిబ్బందితో బయటకు తీస్తున్నారు. బంకు సూపరింటెండెంట్ రామకృష్ణ మాట్లాడుతూ, బంకు లోపలకు నీరు చేరిన విషయాన్ని జీసీసీ డీఎంకు, హెచ్‌పిసిఎల్ (విశాఖపట్నం) అధికారులకు తెలియజేశామన్నారు. పెట్రోల్ ట్యాంకులు అన్నీ క్లీన్ చేసిన తరవాత పెట్రోల్ అమ్మకాలు చేపడతామన్నారు. గతంలో సీలేరు, జీ. మాడుగుల తదితర పెట్రోల్ బంకుల్లోను ఇదే సమస్య ఏర్పడి కొద్ది రోజులు పాటు పెట్రోల్ సరఫరా నిలిపి వేయడం జరిగిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.



బంకులో నీటిని తోడుతున్న సిబ్బంది



పారిశుధ్య పనులు చేపడుతున్న సిబ్బంది

వారపు సంతలో పారిశుధ్య పనులు

- చెత్తాచెదారం తొలగింపు - ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-డుంబ్రిగుడ : మండలంలోని అరకు వారపు సంతలో ప్లాస్టిక్ వ్యర్థాలతో పారిశుధ్యం పేరుకు పోవడంతో ఈనెల 14న అపరిశుభ్యంగా వారపు సంత అనే పేరిట కథనం ప్రచురితమైంది. స్పందించిన స్థానిక పంచాయతీ కార్యదర్శి వల్లి శనివారం వారపు సంతలో సందర్శించి పేరుకుపోయిన అపారిశుద్ధ్యన్ని తొలగించారు. . ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ వారపు సంత జరిగే పరిసరాల్లో ఎప్పటికప్పుడు ప్రతి వారం అపారిశుధ్యం నిల్వ ఉండకుండా తొలగింపు చర్యలు చేపడుతున్నామని ఆయన చెప్పారు. వ్యాపారులు చెత్తా చెదారాన్ని ఎక్కడబడితే అక్కడ వేయరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లోతేరులో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: అరకువేలి మండలం లోతేరు సచివాలయం కేంద్రంగా శనివారం మిథలీ ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో హైదరాబాద్ నుంచి వచ్చిన డాక్టర్లు వీర్రాజు, కృష్ణమోహన్, ప్రియాంక రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఈ వైద్య శిబిరంలో సుమారు 300 మంది ప్రజలు ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్య శిబిరంలో పాల్గొన్న డాక్టర్ వీర్రాజు.మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో గిరిజనులకు వైద్య సేవలు అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ ప్రాంతంలో చాలామంది రక్తహీనత, జ్వరాలతో బాధపడుతున్నట్టు ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బిజెపి జిల్లా అధ్యక్షులు రాజారావు, మండల అధ్యక్షులు రామచంద్ర, స్థానిక సర్పంచ్ శ్రీరాములు, రాఘవేంద్రరావు, వేమన్న, నాయుడు పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్యులు

రూ.2 లక్షల బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి-గొలుగొండ: గొలుగొండ మండలం జీ.కొత్తూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ క్రియాశీలక కార్యకర్త కూండ్రపు సత్తిబాబు జూన్ 25న జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. తెలుగు దేశం పార్టీ సభ్యత్వం ఉన్న సత్తిబాబు కుటుంబానికి ప్రమాద భీమా కింద తెలుగు దేశం పార్టీ కార్యాలయం నుండి ఆయన కుమార్తె రాముకు రెండు లక్షల రూపాయల బ్యాంక్ చెక్‌ను స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటీసి రవివర్మ, టిడిపి మండల కమిటీ సభ్యులు గోవిందరాజు, రామరాజు, బాబులు తదితరులు పాల్గొన్నారు.

వరద పోయింది... బురద మిగిలింది.

పుట్టెడు కష్టాల్లో ముంపు బాధితులు

- అవస్థలు పడుతూ ఇళ్లకు తిరుగుముఖం
- పంట, ఆస్తి నష్టాలతో మన్యవాసుల విలవిల
- ఇంకా పలు గ్రామాలకు సాగని రాకపోకలు

ప్రజాశక్తి- విఆర్ పురం: ఏజెన్సీలోని గోదారి, శబరి వరద ముంపు గ్రామాలను మెల్లగా వీడుతున్నా, భారీ ఎత్తున పేరుకుపోయిన బురద ముంపు బాధితులకు సమస్యగా మారింది. వరదలు తగ్గడతో మన్యవాసులు ఊపిరి పీల్చుకుంటున్నప్పటికీ, శబరి, గోదావరి వరదలు తగ్గుముఖం పట్టి, రహదారులు వరద తాకిడికి కొట్టుకుపోవడం, పలుచోట్ల బురద పేరుకుపోవడంతో రహదారులపై ప్రయాణించేందుకు వాహనదారులు ప్రజలు తీవ్ర పాట్లు పడుతున్నారు. ఇపుడిపుడే ఇళ్లకు చేరుకుంటున్న బాధితులకు బురద సమస్య భారంగామారుతోందని ఆవేదన చెందుతున్నారు. ఇళ్లకు పట్టిన బురద వదిలించుకోవడానికి రూ.మూడు వేలు నుంచిరూ.ఐదు వేలు వరకు ఖర్చు అవుతుందని, ప్రస్తుత పరిస్థితుల్లో తాము ఎలా భరించగలమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆర్థిక సహాయం కింద పదివేల రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

కాగావరద తగ్గుతున్నప్పటికీ మండలంలోని సృష్టివారి గూడెం, అడి వెంకన్నగూడెం మధ్యలో వాగు, శ్రీరామగిరి వెళ్లే రహదారిపై మాత్రం ఇంకా రహదారులపైనే వరద ఉంది.రహదారులపై వరద నీరు అలానే ఉండటంతో విఆర్ పురం, చింతూరు, మండలాలతో పాటు, మండలంలోని పలు ఆదివాసీల పల్లెలకు ఇంకా రాకపోకలు స్తంభించే ఉన్నాయి. విఆర్ పురం ఏజెన్సీలో రైతన్నలు ఎప్పుడూ ఆగస్టు దాటిన తరువాత వరినాట్లు, ఇతర పంటలు వేసుకుంటారు. ఈ ఏడాది సైతం అలానే వేసుకున్నప్పటికీ సెప్టెంబర్‌లో వరదలు రావడంతో పంటలు నీట మునిగి రైతన్న కంట కన్నీరు పెడుతున్నారు. పంటలు వేయడానికి రూ.వేలు ధారపోసామని, పంటలన్నీ వరద పాలయ్యాయని కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.



పునరావాస కేంద్రాల నుంచి ఇళ్లకు చేరుకుంటున్న బాధితులు



విఆర్.పురంలో ముంపు బారిన పడిన వరిపైర్లు

చింతూరు. : వరదలు తగ్గినా కానీ వర్షాలు ఆగిన కానీ రోడ్డుపై బురద మాత్రం మిగిలి ఉంది. కొన్నిచోట్ల మూడు నుంచి నాలుగు అడుగుల ఎత్తుకు రోడ్డుపై మట్టి పేరుకుపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.. శబరి గోదావరి నదులు సాదారణస్థితిలో ప్రవహిస్తుండడంతో పునరావాస కేంద్రాల నుంచి ఇళ్లకు చేరుకున్న బాధితులు వాటిని శుభ్రం చేసుకుంటున్నారు. మన్యంలో అంతర్గత రహదారులు ముంపు నుండి బయటపడటంతో రవాణా సౌకర్యం మెరుగుపడింది. తాగునీటి బోర్లలో నీరు కలుషితం కాకుండా అధికారులు తక్షణమే క్లోరినేషన్ చేయాలని ప్రజలు కోరుతున్నారు. కొన్ని మారుమూల వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ ఇంకా చల్ల లేదు. దోమలు విపరీతంగా పెరిగినాయి. అధికారులు తక్షణమే చొరవచూపి దోమలు వ్యాప్తి చెందకుండా వ్యాధులు రాకుండా అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పంట నష్టాల పరిశీలన

ప్రజాశక్తి- విఆర్.పురం మండలంలోని రాజపేట పంచాయతీ తోటపల్లి గ్రామంలోని శబరి గోదావరి వరదలో ముంపు బారిన పడి పాడైన పంట పొలాలను సిపిఎం బృందం పరిశీలించింది బాధిత రైతులను పరామర్శించి, వారి సమస్యలను, పంటనష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది ఇప్పటికే మూడుసార్లు వరదలు రావడంతో వరి పొలాలు పూర్తిగా మునగటంతో పనికిరాకుండా పోయాయన్నారు. తోటపల్లి గ్రామంలో 90 ఎకరాలు, శ్రీరామగిరి పంచాయతీలో పది ఎకరాలు ఇలా మండల వ్యాప్తంగా 3 వేల ఎకరాలు పంట నష్టం జరిగిందన్నారు.

ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం. సత్యనారాయణ మాట్లాడుతూ శబరి గోదావరి పొంగడంతో వరి, మిర ప పంటలకుర నష్టం వాటిల్లిందన్నారు. నష్టపోయిన వరిపంటకు ఎకరానికి రూ.20వేలు, మిర్చిపంట నారుమళ్లకు రూ.50, వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. తక్షణమే అగ్రికల్చర్ అధికారులు సర్వే చేసి రైతులకు నష్టపరిహారం అందించాలని కోరారు. మండలంలోని ఏ ఒక్క రైతు నష్టపోకూడదని, బాధితులందరకీ నష్ట పరిహారం అందించాలని కోరారు. సిపిఎం నాయకులు సోడి మల్లయ్య, కుంజ కన్నయ్య, జి. లక్ష్మణరావు, టి. కాంతారావు, ప్రకాష్ రావు, రైతులు ముల్లి, సత్యనారాయణ, మడకం మల్లయ్య, పులి చంద్రావు పాల్గొన్నారు



పంటనష్టాలను పరిశీలిస్తున్న సిపిఎం నేతలు

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

- పాడేరు సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పడాల్

ప్రజాశక్తి -సీలేరు: వరదలు కారణంగా ధ్వంసమైన పంట పొలాలు ఇల్లు నష్టాన్ని అధికారులతో సర్వే చేయించి నష్ట నివారణ చర్యలు పూర్తిస్థాయిలో చేపడతామని పాడేరు సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పడాల్ భరోసానిచ్చారు. బాధితులు ఆందోళన చెందవద్దన్నారు. శనివారం దారకొండ పంచాయతీ నిమ్మచెట్టు గ్రామాన్ని సందర్శించి, జరిగిన నష్టాన్ని స్వయంగా పరిశీలించారు. అనంతరం అదే పంచాయతీకి చెందిన గంగవరం, అగ్రహారం కమ్మరి తోట, చోడు రాయి గ్రామాల్లో తుఫాను దాటికి ధ్వంసమైన పంట పొలాలు వరదలకు కొట్టుకుపోయిన వంతెనలు పరిశీలించారు.ఈ సందర్భంగా అనేక గ్రామాలకు మంచినీటి సమస్య ఉందని సర్పంచ్ రాజు సబ్ కలెక్టర్ దర్శృష్టి తీసుకువచ్చారు. చోడురాయి, మాదిగ మల్లు వంతెనలు వరదలకు కొట్టుకుపోవడంతో 130 గ్రామాల ప్రజలు నిత్యవసర సరుకులు తెచ్చుకోవడానికి ,ఆరోగ్య సేవలు పొందడానికి ఇబ్బందికరంగా మారిందనిసబ్ కలెక్టర్ దృష్టికి సర్పంచ్ రాజు తేవడంతో ఆయన స్పందించారు. చోడురాయి వంతెన వద్దకు చేరుకొని పరిశీలించారు. గిరిజనులు తాత్కాలికంగా నిర్మించిర వంతెనను పరిశీలించారు

ఈ సందర్భంగా మాట్లాడుతూ తుఫాన్ కారణంగా జరిగిన నష్టాన్ని చూశానని, వరద నష్టాన్ని కలెక్టర్ దినేష్ కుమార్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. అన్నిశాఖల అధికారులను పంపించి, ఆయా శాఖల వారీగా నష్టాలను అంచనా వేయించి, నివేదికలను రప్పించి కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. వాటి ఆధారంగా నష్టనివారణ చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో దారకొండ ఎంపిటిపి మాడి రామన్న, టిడిపి నేత మాడుగుల .చంద్రిక సిపిఐ నాయకులు సుంకర. విష్ణుమూర్తి, కాంగ్రెస్ నాయకులు మల్లు. దొర గుమ్మరేవుల సర్పంచ్ ఎం. కమలమ్మ గ్రామస్తులు పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

సీతారాం ఏచూరికి ఘననివాళి



చింతూరులో నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి-చింతూరు : సిపిఎం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, వామపక్ష మేధావి సీతారాం ఏచూరి సంతాప సభలను మండలంలోని తుమ్మల, అల్లిగూడెం, మధుగూరు, లక్కవరం గ్రామాలలో నిర్వహించారు. ఏచూరి చిత్రపటాలకు ఆయా గ్రామ శాఖల ఆధ్వర్యంలో పూల మాలలు వేసి నివాళులర్పించారు. సంతాపం తెలిపారు.కార్యక్రమాల్లో నాయకులు ముట్టం రాజయ్య, మడకం చిన్నయ్య, పోడియం లక్ష్మణ్, కారం సుబ్బారావు, పోశం వీరయ్య, సత్తిబాబు, భీమయ్య, లెనిన్ పాల్గొన్నారు.

మోతుగూడెం: చింతూరు మండలం, మోతుగూడెం గ్రామంలో సిఐటియు ఆధ్వర్యంలో సీతారాం ఏచూరికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు బీవీ రమణ, చింత రాంబాబు మాట్లాడుతూ. ఏచురి చేసిన సేవలు కొనియాడారు.. సీతారాం బాటలో నడుస్తూ, ఆయన ఆశయసాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.



మోతుగూడెంలో ఏచూరికి నివాళులు

జి.మాడుగుల: సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి వామపక్ష ప్రజాతంత్ర శక్తులకు తీవ్ర నష్టమని లోటని సిపిఎం మండల కార్యదర్శి సాగిన ధర్మన్నపడాల్ అన్నారు. జి మాడుగులలో సీతారాం ఏచూరి చిత్రపటానికి శనివారం పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ధర్మన్న పడాల్ మాట్లాడుతూ, ఉత్తమ పార్లమెంట్ సభ్యుడుగా గుర్తింపు పొందారన్నారు. దేశ అభివృద్ధికి ఎంతో తపనతో ప్రభుత్వాలకు సూచనలు చేశారని కొనియాడారు. అంతర్జాతీయ స్థాయిలో గొప్ప మార్క్సిస్టు నాయకులుగా గుర్తింపు పొందిన వ్యక్తి సీతారాం ఏచూరి అన్నారు. ఎన్నికల ప్రచార సభ సందర్భంగా రంపచోడవరం నియోజవర్గం కూనవరంలో నిర్వహించిన బహిరంగ సభలో కామ్రేడ్ సీతారం ఏచూరి పాల్గొని ప్రసంగించారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీహరి, శ్రీకాంత్, స్వర్ణలత, చంటి పాల్గొన్నారు



జి.మాడుగులలో నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు



ఎస్ఐని అభినందిస్తున్న వైస్ ఎంపిపి

ఎస్ఐని కలిసిన వైస్ ఎంపిపి

ప్రజాశక్తి -డుంబ్రిగుడ : మండలంలో నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన కెపి నాయుడును మండల వైస్ ఎంపీపీ ఎస్.ఆనంద్ శనివారం పోలీస్ స్టేషన్ లో మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. అనంతరం మండల సమస్యలపై వివరించి పరిష్కారానికి కృషి చేయాలని కోరినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఉపసర్పంచ్ జగ్గు నాయుడు, నాయుడు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - చింతపల్లి : గురుకుల ఆశ్రమ వసతి గృహ విద్యాలయాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు వంతల బాబురావు కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ, గురుకుల ఆశ్రమ వసతి గృహాలలో సకాలంలో టెండర్ ప్రక్రియ పూర్తి చేయక పోవడంతో మెనూ సక్రమంగా అమలు చేయలేదన్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో టెండర్ ప్రక్రియను నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించారని ఆయన ఆరోపించారు. టెండర్ను నిబంధనలకు విరుద్ధంగా మైదాన ప్రాంతానికి చెందిన వారికి కట్టబెట్టారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు సైతం గిరిజనులపై వివక్షత చూపుతున్నారని, అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

స్పీకర్‌ను కలిసిన రూరల్ సిఐ రేవతమ్మ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం రూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టిన ఎల్.రేవతమ్మ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ శాంతిభద్రతల విషయమై చర్చించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఎస్సై ఉమామహేశ్వరరావు, మాకవరపాలెం ఎస్సై దామోదర్ నాయుడు, గొలుగొండ ఎస్సై రామారావు, కృష్ణదేవిపేట ఎస్సై దివ్యలు కూడా పాల్గొన్నారు.

తాగునీరు సరఫరా : ఫలించిన మహిళల పోరాటం

ప్రజాశక్తి-కోటవురట్ల: మండల కేంద్రంలో తాగునీటి సమస్యపై శుక్రవారం సచివాలయం వద్ద మహిళలు నిరసన వ్యక్తం చేయడంతో శనివారం గ్రామ కార్యదర్శి శ్రీనివాసరావు, గ్రామీణ నీటి సరఫరా అధికారిని గీతాంజలి స్పందించారు. సమస్యను పరిష్కరించి నీటి సరఫరా చేపట్టడంతో మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామీణ నీటి సరఫరా అధికారిని గీతాంజలి మాట్లాడుతూ, వరాహానది అవతల వైపు ఉన్న పంపు హౌస్ నుంచి వచ్చే పైప్‌లైను వరాహా నదిలో నది ఉధృతికి తెగిపోవడంతో సమస్య ఏర్పడిందన్నారు. తాగునీటి ఇబ్బందులు కలగకుండా అంగన్వాడి సెంటర్ వద్ద ఉన్న బోర్ నుండి ట్యాంకుకు పంపింగ్ చేస్తున్నామని తెలిపారు. వరాహానది నీటి ఉధృతి ఎక్కువగా ఉన్న కారణంగా పైప్‌లైను పనులు చేపట్టేందుకు కుదరక పోవడంతో తాగునీటి సమస్య ఏర్పడిందని, శాశ్వత పరిష్కారం కోసం పైప్‌లైను పనులు వేరే ప్రాంతం నుంచి చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమస్య పునరావృతం కాకుండా పనులు చేపడతామని ఈ సందర్భంగా తెలిపారు.

ఫామ్ ఆయిల్ సాగుపై అవగాహన

ప్రజాశక్తి-నాతవరం: మండలంలోని చిన్న జగ్గంపేట గ్రామంలో పతంజలి కంపెనీ ఆధ్వర్యంలో ఫామ్ ఆయిల్ తోటలు సాగుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ మేనేజర్ తోట రామచందర్ మాట్లాడుతూ, పంట ఆవశ్యకత, రాయితీలు, దిగుబడులపై వివరించారు. అనంతరం అసిస్టెంట్ మేనేజర్ కె.రమేష్, ఫీల్డ్ ఆఫీసర్ ఏ.నాగేశ్వరరావు మాట్లాడుతూ, పంట యాజమాన్య పద్ధతులు వివరించి రైతుల సందేహాలను నివృత్తి చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో రైతులు గాడి శ్రీరామ్ మూర్తి, పైల పోతురాజు ,జి .రాజుబాబు తదితరులు పంట అనుభవాలను వివరించారు.

అడ్డురోడ్డులో ప్రయాణ అవస్థలు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల వాసులకు అడ్డురోడ్డు ప్రయాణం నరక ప్రాయంగా కావడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. మండలం నుంచి అడ్డరోడ్డు వెళ్లాలంటే రోడ్డు సదుపాయం సక్రమంగా లేక పోవడంతో ప్రయాణికుల జేబులతో పాటు శరీరం కూడా గుల్ల అవుతున్న పరిస్థితి నెలకొంది. రామచంద్రపురం సమీపంలో వంతెన కుంగిపోవడం, ఆటో సదుపాయం బస్సు సదుపాయం సక్రమంగా లేక గడిచిన వారం రోజులుగా ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఇందేశమ్మ వాక సమీపంలో రోడ్డు కోతకు గురికావడంతో పాటు ఎగువ నుండి బండ రాళ్లు కొండ చరియలు విరిగి పడుతూ ఉండడంతో ప్రయాణం మరింత నరకప్రాయంగా తయారైంది. ఇక పందూరు నుండి అడ్డురోడ్డు వరకు రోడ్డు పరిస్థితి చూస్తే ఉయ్యాల జంపాల మాదిరిగానే ఉంటుంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో అడ్డురోడ్డు నుంచి కోటవురట్ల వచ్చేందుకు బస్సు, లేదా ఆటోకు 30 రూపాయలు ఛార్జ్ తీసుకునేవారు. ప్రస్తుతం అడ్డు రోడ్డు నుండి కోటవురట్ల వచ్చేందుకు రోడ్డు సదుపాయం లేక పోవడంతో రెండు ఆటోలు మారాల్సిన పరిస్థితి నెలకొంది. దీన్ని ఆసరాగా చేసుకుని అడ్డు రోడ్డు నుండి రామచంద్రపురం వరకు 50 రూపాయలు, అక్కడి నుండి కోటవురట్లకు 50 రూపాయలు చార్జీలు ముక్కు పిండి వసూలు చేస్తున్న పరిస్థితి నెలకొంది. దీంతో, ప్రయాణికులు తీవ్ర అసంతృప్తి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడం విశేషం, వంతెన కుంగిన సందర్భంలో మంత్రి అనిత, జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ సందర్శించి రెండు రోజుల్లో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. వారం రోజులు పూర్తిగా కావస్తున్నా నేటికీ డైవర్షన్ పనులు చేపట్టకపోవడం పట్ల ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు, అధికారులు త్వరితగతిన డైవర్షన్ పనులు పూర్తిచేసి, శాశ్వత వంతెన నిర్మాణం పనులు చేపట్టాలని ప్రయాణికులు మండల వాసులు కోరుకుంటున్నారు.

సిఐ, ఎస్ఐలు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -కొత్తకోట: కొత్తకోట సర్కిల్ పరిధిలో కొత్తకోట ఎస్సైగా యం.శ్రీనివాసరావు, రావికమతం ఎస్సైగా రఘువర్మలు శనివారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీలలో భాగంగా అనకాపల్లి కంట్రోల్ రూమ్ పిఆర్ సి విభాగంలో పనిచేస్తున్న శ్రీనివాసరావు కొత్తకోట పోలీసు స్టేషన్ కు బదిలీ పై రాగా ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహించిన లక్ష్మణరావు కశింకోట బదిలీ పై వెళ్లారు. అలాగే అనకాపల్లి డబ్ల్యు పిసి విభాగంలో పనిచేస్తున్న రఘువర్మ రావికమతం పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ధనుంజయ నాయుడును అనకాపల్లి విఆర్‌కు బదిలీ చేసారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని, గ్రామాలలో ఆ సాంఘిక,చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కేసులు నమోదు తప్పవని హెచ్చరించారు. నాటు సారా తయారీ, గంజాయి అక్రమ రవాణా వంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పిడితే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.. వీరికి ఆయా పోలీసు స్టేషన్ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు...

నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం రూరల్ సీఐగా ఎల్.రేవతమ్మ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గంజాయి రవాణా, నాటుసారా నిర్మూలనకు తమ వంతు బాధ్యత వహిస్తానన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ఈ మేరకు బాధ్యతలు స్వీకరించిన సీఐను సర్కిల్ పరిధిలోని ఎస్సైను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

పరిశ్రమలతో ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి - చీడికాడ: పరిశ్రమలు ఏర్పాటయితే ఉపాధి అవకాశాలతో పాటు ఆ ప్రాంతాలు అభివృద్ధి చెందు తాయని మాడుగుల నియోజకవర్గం ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మాడుగుల నియోజకవర్గంలోని చీడికాడ మండలంలో ఎంఈఎం ఎస్ పరిశ్రమల ఏర్పాటుకు స్థల సేకరణకు గాను శనివారం మండలంలోని అడవిల అగ్రహారం ప్రాంతంలో భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏ ప్రాంతం అయినా అభివృద్ధి చెందాలంటే పరిశ్రమలతోనే సాధ్యమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాడుగుల నియోజకవర్గానికి రెండు పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం కల్పిస్తానని గతంలో హామీ ఇచ్చారని, ఆ హామీ ప్రస్తుతం నెరవేరుస్తున్నారన్నారు. ఆయన ఆదేశాల మేరకు మాడుగుల నియోజకవర్గంలోని ఆర్లిలో ఇటీవల స్థల పరిశీలన జరిగిందని, చీడికాడ మండలంలోని అడవుల అగ్రహారంలో పరిశీలిస్తున్నామన్నారు. ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేస్తే వేలాదిమంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రామానాయుడు, టిడిపి నాయకులు పైల ప్రసాదరావు, గ్రామ సర్పంచ్ సూరి నాయుడు, ఎంపీటీసీలు, రెవెన్యూ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

220 ఎకరాల్లో పంట నష్టం : తహశీల్దార్

ప్రజాశక్తి -నక్కపల్లి: తుఫాన్ ప్రభావంగా ఇటీవల కురిసిన వర్షాలకు నక్కపల్లి మండలంలో 220 ఎకరాల వరి పంట నీటి మునిగి నష్టం వాటిల్లినట్లు తహసీల్దార్ అంబేద్కర్, వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ తెలిపారు. మండలంలో సాధారణ సాగు 4400 కాగా 4480 ఎకరాల్లో వరి సాగు అయినట్లు తెలిపారు .గ్రామ కమిటీలు గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ సర్వేయర్ ద్వారా నీటి ముంపునకు గురైన పొలాలను పరిశీలించి నష్టం అంచనా వేసినట్లు తెలిపారు. 33శాతం పైన దెబ్బతిన్న వరి కు హెక్టారు కు 17,000 రూపాయలు చొప్పున పరిహారం అందుతుందన్నారు. పంట నష్టం జాబితా లో 230 మంది రైతుల పేర్లను నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపించడం జరిగిందని వెల్లడించారు .

నేరాలు ఘోరాలు

సరియా జలపాతంలో ఇద్దరు గల్లంతు

ప్రజాశక్తి -అనంతగిరి: ప్రముఖ పర్యాటక కేంద్రమైన సరియా జలపాతంలో ఇద్దరు గల్లంతయ్యారు. శనివారం ఇద్దరు పర్యాటకులు జలపాతంలో సందర్శించారు. అనంతరం స్నానాలు చేసేందుకు జలపాతంలో దిగారు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు ఊబిలోకి దిగి విజయనగరం జిల్లా పైడి భీమవరనికి చెందిన ఇండియన్ నేవీ ఉద్యోగి దిలీప్ కుమార్, లంక సాయికుమార్‌లు చిక్కుకు పోయారు. మారుమూల ప్రాంతం కావడంతో గల్లంతైన వారి సమాచారం అందవలసి ఉంది.

గంజాయి కేసులో ఒకరు అరెస్ట్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖపట్నం రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫామ్‌పై విశాఖపట్నం జిఆర్‌పి ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనంజయనాయుడు ఆధ్వర్యాన ఆర్‌పిఎస్‌ఐ వి.రవివర్మ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో గంజాయి అక్రమంగా రవాణా చేయడానికి రెక్కీ నిర్వహిస్తున్న అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన సదేరి సత్తిబాబును అదుపులోకి తీసుకున్నారు. సత్తిబాబును సబ్-ఇన్‌స్పెక్టర్ వి.రవివర్మ అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. మాదకద్రవ్యాల స్మగ్లింగ్ ముఠాలను పట్టుకోవడానికి రైల్వే పోలీస్, ఆర్‌పిఎఫ్ ప్రత్యేక టీమ్‌ల సహాయంతో నిఘా వర్గాలను ఏర్పాటుచేసి, విశాఖపట్నం, దువ్వాడ, అనకాపల్లి, సింహాచలం రైల్వేస్టేషన్ పరిధిలో తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

పాముకాటుతో రైతు మృతి


ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని డొంకాడ గ్రామానికి చెందిన రైతు సఖిరెడ్డి శివ(30) పాముకాటుతో మృతి చెందినట్లు హెచ్‌సి వెంకటరావు తెలిపారు .శుక్రవారం శివ పొలంకు వెళ్ళినప్పుడు పాము కాటు వేసింది. దీంతో ఆయన ఇంటికి వస్తూ మార్గ మధ్యలో అపస్మారక స్థితికి చేరి పడిపోయాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే శివను తుని ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలించారు. పరిస్థితి విషమించడంతో శనివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు వెంకట్రావు తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

పట్టుబడ్డ ఇసుక ట్రాక్టర్లు

ప్రజాశక్తి- కోటవురట్ల: మండలంలో రాజుపేట గ్రామం సర్పనది నుండి నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతుండటంతో తహసిల్దార్ జానకమ్మ రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేశారు. శనివారం తెల్లవారుజామున రాజుపేట గ్రామం నుండి నిల్వ చేసిన ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ ఉండగా గ్రామ రెవెన్యూ అధికారి అనూష, చౌడువాడ గ్రామ రెవెన్యూ అధికారి రమేష్ పట్టుకొని స్థానిక పోలీస్ స్టేషన్కు అప్పగించారు, తహసిల్దార్ ఆదేశాల మేరకు పట్టుబడ్డ ట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటామని పోలీస్ రెవెన్యూ అధికారులు తెలిపారు. రాజుపేట పరిసర ప్రాంతాల నుంచి రాత్రి సమయంలో నిరంతరాయంగా టైరు బళ్ళు ద్వారా నిలవచేసుకున్న ఇసుకను ట్రాక్టర్లతో తరలిస్తూ ఉండడం విశేషం. ఒక్కో టైరు బండి ఇసుకకు ట్రాక్టర్ల యజమానులు రూ.800 చొప్పున కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం, రాజుపేట, జంగాలపల్లి, రామన్నపాలెం, సహా మాకవరపాలెం మండలం పలు గ్రామాల టైరు బళ్ళు ద్వారా నిరంతరాయంగా ఇసుకను తరలిస్తున్నారు. మాకవరపాలెం మండలానికి చెందిన ట్రాక్టర్లు మాకవరపాలెం నర్సీపట్నం సహా ఇతర ప్రాంతాలకు నిలువ చేసిన ఇసుకను తరస్తున్నారు. ఒక్కో టాక్టర్ 6000 చొప్పున అమ్ముతున్నట్లు తెలిసింది. పలుమార్లు పోలీసులు రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించినా నిత్యకృత్యంగా వ్యాపారం సాగిస్తున్నారు, సర్పా నది పరివాహక ప్రాంత రైతులు ఇసుక తరలింపు పట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట భూములు కోతకు గురవుతున్నాయని అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోక పోవడంతో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. అధికారులు కఠినమైన చర్యలు చేపట్టాలని స్థానికులు సర్పానది పరివాహక ప్రాంత రైతులు కోరుకుంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - ఆరిలోవ : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన శనివారం జాతీయరహదారి జూ పార్కు వద్ద చోటు చేసుకుంది. కొమ్మాది, కార్పెంటర్స్ కాలనీకి చెందిన కిల్లి చంద్రశేఖర్ (22) శనివారం ఉదయం 4 గంటలకు కొమ్మాది నుంచి వాల్తేరు డిపోకు తండ్రి కిల్లి అన్నంనాయుడును బైక్‌పై తీసుకొని వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో జూ పార్కు సమీపంలో బైకు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి గాయాలపాలయ్యాడు. స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. చంద్రశేఖర్ అప్పటికే మృతి చెందినట్టు అంబులెన్స్ సిబ్బంది తెలిపారు.



పాలు, సాల్ట్ ప్యాకెట్లను అందజేస్తున్న ఎంపిపి కారం లక్ష్మి తదితరులు

ముంపు బాధితులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - విఆర్ పురం: వరదముంపు బాధితులను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని ఎంపిపి కారం లక్ష్మి కోరారు. శనివారం మండలంలోని రామవరం పంచాయతీ ఆడి వెంకన్నగూడెం గ్రామంలో సహాయక చర్యలలో భాగంగా ం తహసీల్దార్ పంపించిన పాల పాకెట్స్, సాల్ట్ పాకెట్స్, ఎంపిపి కారం. లక్ష్మి, గ్రామ సెక్రెటరీ తాతారావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి లక్ష్మి మాట్లాడుతూ గోదారి, శబరి వరద ముంపుతో ఇళ్లు, గ్రామాలను వదిలి ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారని, పంటలు, ఆస్తులతోపాటు ఆర్థికంగా చాలా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే రూ.పదివేలు ఆర్థికసాయం అందజేయాలని కోరారు. వరదలకు నష్టపోయిన ఇళ్లు, పంటలను గుర్తించి, బాధితులకు పూర్తి పరిహారం అందజేసి ఆదుకోవాలని కోరారు. ఇప్పటికి మూడుసార్లు వరదలు వస్తే, రూ.మూడు వేలు ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకోవడం దారుణమన్నారు. వార్డు సభ్యుడు సుధీర్ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని ముల్కనపల్లి పంచాయతీ జల్లి వారి గూడెం గ్రామంలో వరద బాధితులకు ప్రభుత్వం అందించిన బియ్యాన్ని సర్పంచ్ సవలం. మారయ్య పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జల్లి చిన్న తమ్మయ్య, జల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

కూనవరం : పోలవరం ప్రాజెక్టు నీటి ఎగపోటు వల్ల ముంపుబారిన పడుతున్న ప్రజలందరికి న్యాయం చేయాలని వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య అన్నారు. శనివారం సిపిఎం కార్యాలయంలో సమావేశంలో మాట్లాడుతూ గోదావరి వరదలు మండలవ్యాప్తంగా వస్తున్నాయని, ముంపు సమయంలో ఉపాధి లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ముంపునకు గురైన ప్రతి గ్రామానికి నిత్యావసరాలు ఇవ్వాలని కోరారు. కూటూరు, రేగులపాడు పంచాయతీల్లో అనేక గ్రామాలకు నిత్యావసరాలు ఇవ్వలేదనిన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి అమ్మాజీ, జయసుధ, సర్పంచులు నాగమణి, వెంకమ్మ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి హెల్పింగ్ హ్యాండ్స్ చేయూత

ప్రజాశక్తి-కూనవరం : విద్యుత్‌షాక్‌తో దుర్మరణం పాలైన కూనవరం మండలం పల్లూరు గ్రామానికి చెందిన ఆవుల వెంకటరామరావు ఎలక్ట్రీషియన్ కుటుంబానికి హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ అండగా నిలిచింది. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని వాట్సాప్ గ్రూపు ద్వారా సందేశం ఇవ్వగా, మానవతాదృక్పథంతో స్పందించి రూ.50,032 లు ఆర్థిక సహాయం అందించారు. ఆపదలో ఉన్న కుటుంబానికి ఆదుకోవటానికి సహృదయంతో స్పందించి ఆర్థికంగా సహకరించిన ప్రతిఒక్కరికి హెల్పింగ్ హాండ్స్ మిత్ర బృందం ఆవుల సంతోష్ కుమార్, కర్నాటి సాయి ప్రదీప్, ఆవుల వెంకటేష్, సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఆవుల ఉపేంద్ర, ఆవుల గురవయ్య, ఆవుల మురళీకష్ణ, కర్నాటి శ్రీను, శ్రీమంతుల వెంకట రమణ, ఆవుల గోపాల కష్ణ, పరిటాల వెంకట్, నస్కూరి, కరక సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

నవంబర్ 29 నుంచి క్రెడాయ్ ప్రాపర్టీ షో

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నవంబర్ 29 నుంచి మూడు రోజుల పాటు నగరంలోని గాదిరాజు ప్యాలెస్‌లో క్రెడాయ్ ఆధ్వర్యంలో ప్రాపర్టీ షో నిర్వహించనున్నట్టు ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. శనివారం నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో బ్రోచర్ విడుదల చేశారు. సొంతింటి కల నెరవేర్చుకునేందుకు ఇదో వేదికని తెలిపారు. ఇళ్ల నిర్మాణదారులకు అన్ని విషయాల్లోనూ అవగాహన కల్పించేందుకు నవంబర్ 29, 30, డిసెంబర్ 1వ తేదీల్లో ఈ ప్రదర్శన ఉంటుందని వెల్లడించారు. క్రెడాయ్ విశాఖ చాప్టర్ ఛైర్మన్ కెఎస్ఆర్‌కె.రాజు (సాయి) తదితరులు పాల్గొన్నారు.

సన్యాసిరావు మృతి కళారంగానికి తీరనిలోటు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం

ప్రజాశక్తి - గాజువాక, విశాఖ కలెక్టరేట్ : ప్రజా గాయకుడు, కవి, రచయిత, ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు జి.సన్యాసిరావు మృతి కళారంగానికి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం అన్నారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న సన్యాసిరావు శనివారం గాజువాకలోని తన చిన్న కుమారుడు సుందరయ్య ఇంటి వద్ద మృతిచెందారు. ఆయన పార్థివదేహాన్ని గాజువాక నుండి కెజిహెచ్‌కు అంతిమయాత్రగా తీసుకొచ్చారు. అనంతరం అనాటమీ డిపార్టుమెంటుకు పరిశోధనల నిమిత్తం అప్పగించారు. సన్యాసిరావు సంతాప సభ గాజువాకలోని ఆయన కుమారుని ఇంటి వద్ద నిర్వహించారు. తొలుత సన్యాసిరావు పార్థివ దేహం వద్ద పలువురు నివాళి అర్పించారు. సంతాప సభలో లోకనాథం మాట్లాడుతూ విశాఖలో సిపిఎం, పిఎన్ఎం కార్యక్రమాలు, ఉద్యమాలు ఎక్కడ జరిగినా అక్కడ కచ్చితంగా సన్యాసిరావు ఉండేవారన్నారు. ఆయన పాటతో ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లారని తెలిపారు. ఆయన ధన్యజీవని కొనియాడారు. ఆయన పార్థివ దేహాన్ని పరిశోధనల నిమిత్తం కెజిహెచ్‌కు అప్పగించిన కుటుంబ సభ్యులను అభినందించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ సన్యాసిరావు జ్ఞాపకాలు ఎవ్వరినీ వీడిపోవన్నారు. ఆయన నమ్మిన సిద్ధాంతం కోసం చివరి వరకు పోరాడిన వ్యక్తి అని తెలిపారు. ఆయన పాటలు ఎందరిలోనో చైతన్యం రేకెత్తించాయన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కెఎం.శ్రీనివాసరావు, గాజువాక, స్టీల్ డివిజన్ కార్యదర్శులు ఎం.రాంబాబు, శ్రీనివాసరాజు, నాయకులు ఎం.రాజు ప్రసాద్, పౌర హక్కుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు టి.శ్రీరామమూర్తి, ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి చంటి మాట్లాడుతూ గొప్ప కళాకారున్ని, చైతన్య శీలిని కోల్పోయామన్నారు. సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ సంతాప సభలో మల్కాపురం జోన్ కార్యదర్శి ఎం.పైడిరాజు, నాయకులు జె.కోటేశ్వరరావు, పి.కోటేశ్వరరావు, పల్లెల నర్సింగరావు, ఎ.లోకేశ్వరరావు, కె.కిరీటం, కె.సంతోషం, స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, సిఐటియు అనకాపల్లి జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు, ప్రజానాట్యమండలి నాయకులు పివైవి.రమణరావు, నాగేశ్వరరావు, వార్వా - నివాస్ నాయకులు డాక్టర్ రమేష్ కుమార్, ప్రజానాట్య మండలి కళాకారులు, నాయకులు పాల్గొన్నారు. సన్యాసిరావు మృతికి సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, సీనియర్ నాయకులు ఎ.అజశర్మ, రెడ్డిపల్లి బాబూరావు, ఎన్.కృష్ణమూర్తి, అరుణ్‌జీ, జి.రమణ, బి.పద్మ, లీలావతి, బాషా, మౌలాలి, దండు నాగేశ్వరరావు, పి.మణి, ఆర్.భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



సన్యాసిరావు పార్థివ దేహం వద్ద నివాళ్లర్పిస్తున్న లోకనాథం తదితరులు

చట్రాపల్లి బాధితులకు ప్రభుత్వం అండ

మాజీ మంత్రి మత్స్యరాస మణికుమారి

ప్రజాశక్తి -సీలేరు: చట్రాపల్లి బాధితులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలుగుదేశం పార్టీ మాజీ మంత్రి మత్యరాస మణికుమారి, రాష్ట్ర కార్యదర్శులు కిల్లో. రమేష్ నాయుడు కొట్టగుల్లి సుబ్బారావు భరోసానిచ్చారు. శనివారం జీకే వీధి మండలం గాలికొండ పంచాయితీ చట్రాపల్లి గ్రామాన్ని సందర్శించారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న చట్రాపల్లి గ్రామ నివాసులకు పరామర్శించారు. బాధితులైన 37 కుటుంబాలకు 5 కేజీల బియ్యం,పప్పు నూనె నిత్యావసర వస్తువులు, చీరలు లుంగీలు అందజేసి ఉదారతను చాటుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విపత్తు కారణంగా చట్రాపల్లి కొండ చరియలు విరిగిపడిన ఘటనలో ఒక మహిళ మృతి చెందగా ముగ్గురికి తీవ్ర గాయాలు కావడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వపరంగా ఆదుకుంటామని, ప్రతి కుటుంబానికి పక్కా గృహాన్ని నిర్మించే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టి తీసుకెళ్తామన్నారు. అధిక వర్షాలకు ధ్వంసమైన రహదారులు పునరుద్ధరించాలని ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. చట్రాపల్లి గిరిజనులకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందన్నారు. సీలేరు, జికె.వీది ప్రధాన రహదారి పునరుద్ధరణ పనులు శరవేగంగా జరుగుతుయన్నారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చట్రాపల్లి వాసులకు సురక్షిత ప్రాంతంలో ఇళ్ల నిర్మాణానికి స్థలం కేటాయింపునకు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ దృష్టి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి ఎస్‌టి సెల్ రాష్ట్రఉపాధ్యక్షులు సోమేలు. చిట్టిబాబు కొయ్యూరు మండల అధ్యక్షులు గిలిసింగి. సత్యనారాయణ, నాయకులు కొర్ర .బలరాం ముక్కల. మహేష్ కొర్ర .రామ్మూర్తి సోమేలి. రమణమూర్తి సన్యాసిరావు ముక్కల. కళ్యాణి వెంకటలక్ష్మి గంగరాజు కార్యకర్తలు పాల్గొన్నారు.



నిత్యావసరాలు, దుస్తులు అందజేస్తున్న మణికుమారి తదితరులు



దుప్పట్లు పంపిణీ చేస్తున్న యుటిఎఫ్ ప్రతినిధులు

వరద బాధితులకు యుటిఎఫ్ అండ

ప్రజాశక్తి- కూనవరం : వరదముంపుతో మండలంలోని శబరి కొత్త గూడెం గ్రామం వద్ద పునరావాస కేంద్రాలలో వారం రోజులు పైగానే నివాసముంటున్న కుంజా వారి గుంపు వాళ్ల కుటుంబ సభ్యులందరికీ యుటిఎఫ్ కోనసీమ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు యు.టి.ఎఫ్.మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.నాగేశ్వరరావు, పి.కన్నారావు తెలిపారు. ఈ సందర్భంగా మండల ప్రధాన కార్యదర్శి పి.కన్నారావు మాట్లాడుతూ సామాజిక స్పృహ కలిగిన సంఘంగా తమ వంతు విరాళాలు సేకరించి ఆపదలో ఉన్నవారికి అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్.కూనవరం మండల కమిటీ సభ్యులు కుంజా.శాంత, చిడె .సత్యవతి దేవి, కట్టం.కుమారి, చిచ్చడి.వెంకటమహాతి, జోడెం.గౌతమి, మడకం. ప్రమీల, మండల కమిటీ కార్యవర్గ సభ్యులు తుష్టి.సుబ్బారావు పాల్గొన్నారు.

డాక్టర్ జమాల్‌ఖాన్‌కు సత్కారం

ప్రజాశక్తి- కూనవరం : ఆపదలో అండగా ఉంటూ ఆదుకుంటున్న ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్‌ను కూనవరం పంచాయతీ మస్జిద్ వద్ద శనివారం యువత దుస్సాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బత్తుల.వెంకటేష్, దాసరి. యేసు, జల్లారపు.రవీంద్ర, దాసరి. కాశి, మొగదాల నాగు, ఉల్లూరి.ప్రసాద్, మారపాక.శ్రీను, సింగులూరి.రవి, మల్లంపల్లి.సాయి,చెలికాని.వెంకీ, మేడిది.శివరాం, మోతుకురి వెంకన్న, ఎడ్ల.శ్రీరాం, పునుగుపాటి.పవన్, యడ్ల.రాంబాబు,గొట్టాల రాజు,ఎల్లాజి, సోడే.మహేంద్ర, బెల్లం.శ్యాంసుందర్ పాల్గొన్నారు.

వృద్ధులకు బియ్యం వితరణ

ప్రజాశక్తి,-కూనవరం : మండలంలోని భీమవరం గ్రామంలో కృష్ణార్జున ఫౌండేషన్ అధ్యక్షుడు" కాకునూరు కృష్ణార్జునరావు 'వద్ధులకు బియ్యం, సబ్బులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన సంపాదనలో సగం మొత్తాన్ని 12ఏళ్లుగా ఇలా ఆపదలో ఉన్నవారికి సాయం చేసేందుకు వినియోగిస్తున్నానన్నారు. కార్యక్రమంలో కె దుర్గాభవాని పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ బలోపేతానికి చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేయాలని, మూసేయాలని కేంద్ర ప్రభుత్వం గతంలోనే నిర్ణయించి, స్పష్టంగా ప్రకటించిన నిర్ణయానికి వ్యతిరేకంగా మూడున్నర సంవత్సరాలకుపైగా కార్మికులు, రాష్ట్ర ప్రజలు పోరాడుతున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజ శర్మ శనివారం ఒక లేఖలో గుర్తుచేశారు. ప్లాంట్ బలోపేతానికి చర్యలు తీసుకోవాలని కోరారు. 2024 ఎన్నికల్లో కూటమి గెలిస్తే స్టీల్‌ప్లాంటును కాపాడతామని ఎన్‌డిఎలో భాగస్వాములుగా సిఎం చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ హామీని నమ్మి ప్రజలు కూటమికి అనుకూలంగా పెద్ద ఎత్తున తీర్పునిచ్చారని, గాజువాక అసెంబ్లీ, విశాఖపట్నం పార్లమెంటు నియోజకవర్గాలలో ఆ పార్టీ అభ్యర్థులు రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీలతో గెలవడానికి ఇదే ప్రధాన కారణమని అన్నారు. టిడిపి, జనసేన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి ఢిల్లీలో దేశ ప్రధానిని కలిసి రాష్ట్ర సమస్యలను ప్రస్తావించినప్పుడు విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ అంశాన్ని కనీసంగా కూడా మాట్లాడలేదన్నారు. అదే విధంగా అమరావతిలో స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కలిసినప్పుడు, వారిని గంటల తరబడి నిరీక్షించేలా చేసి ఆఖరుకు లాభాలు తీసుకురండి, అప్పుడు చూద్దామని సెలవిచ్చారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఒక పక్కన ముడిసరుకు సరఫరా కూడా లేకుండా ఉద్దేశపూర్వకంగానే పీక నులిమేస్తుంటే, లాభాలు ఎలా తీసుకొస్తారో ముఖ్యమంత్రి తెలియజేయాలన్నారు.